www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 23 ఫిబ్రవరి 2025
5
కాకినాడ



సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో శనివారం స్థానిక సాగర్ మున్సిపల్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహనలో భౌతిక శాస్త్రానికి సంబంధించిన ఆమ్లాలు, క్షారాలు, లవణాలు పాఠ్యాంశాలపై విద్యార్థులతో అనేక ప్రయోగాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

చిక్కుల్లో చేనేత

- పెరుగుతున్న ముడి సరుకు ధర
- గిట్టుబాటు ధర గగనం
- పాలక వర్గాలు లేక కుదేలు
- హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వాలు మారుతున్నా చేనేత కార్మికుల తలరాతలు మారడం లేదు. పాలకులు అనుసరిస్తున్న విధానాలతో ఈ రంగం నానాటికీ తీసికట్టుగా మారింది. ముడి సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో గిట్టుబాటు ధర గగనంగా మారుతోంది. గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వంలోనూ ఆప్కోకు పాలక వర్గం ఏర్పాటు కాలేదు. స్థానికంగా ఉన్న సహకార సంఘాలకు అధ్యక్షులు ఉంటారు. వీరు జిల్లాకు ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ఆప్కోకు ఛైర్మన్ వస్తారు. అయితే ఇంత వరకూ పాలక వర్గం ఊసే ప్రభుత్వం ఎత్తక పోవడంతో అధికారుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. సరైన పర్యవేక్షణ లేక, దీనిపై అధికార యంత్రాంగానికి పూర్తిస్థాయిలో అవగాహన లేక చేనేత రంగం చితికిపోతుంది.

ఉమ్మడి జిల్లాలో 50 సహకార సంఘాల్లో సుమారు 30 వేల మంది చేనేత కార్మికులుగా నేమోదయివున్నారు. అలాగే మాస్టర్ వీవర్స్ వద్ద స్వయం ఉపాధి చేసుకుంటున్న వారు మరో 40 వేల మంది వరకూ ఉన్నారు. అధికారులు లెక్కల ప్రకారం వీటి పరిధిలో 15,700 మగ్గాలు ఉన్నాయి. ఇందులో సహకార రంగంలో 11,980, సహకారేతర రంగంలో 3,720 మగ్గాలున్నాయి. యు.కొత్తపల్లి మండలంలోని అమినాబాధ, మూలపేట, గొల్లప్రోలు, ఇదే మండలంలోని తాటిపర్తి, చేబ్రోలు, ప్రత్తిపాడు మండలం ధర్మవరం, తుని, అమలాపురం, బండారులంక, కడియం మండలం దుళ్ల, వీరవరం, విలసవిల్లి, పుల్లేటికుర్రు, అంబాజీపేట, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం తదితర ప్రాంతాల్లో పలు కుటుంబాలు నేత పనిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి.

పెరుగుతున్న ముడి సరుకు ధర

కరోనా తర్వాత నుంచి చేనేత రంగం మరింత పతనానికి గురియైంది. రెండేళ్ళ కరోనా దెబ్బతో చేనేత కార్మికులు అల్లాడిపోయారు. నాడు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఈ రంగాన్ని గట్టెక్కించలేకపోయింది. ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు నేసిన చీరలను కొనేవారు లేక కార్మికులు అష్టకష్టాలు పడ్డారు. ఆ ప్రభావం నేటికీ వీరిని వెంటాడుతూనే ఉంది. మరోవైపు చేనేతలకు అండగా నిలిచే మాస్టర్ వీవర్స్ బతుకులు కూడా దుర్భరంగా మారిపోయాయి. ముడిసరకు ధరలకు తోడు పెరుగుతున్న విద్యుత్తు ఛార్జీల భారం కూడా నేతన్నల నడ్డి విరుస్తోంది. ఈ నేపథ్యంలోనే మగ్గాలనే నమ్ముకుని బతుకులు వెళ్లదీస్తున్న వేల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో కార్మికులకు ప్రోత్సాహం లేకపోవడంతో సమస్యలు ఇంకా పెరుగుతున్నాయి. గతంలో కిలో పట్టు రూ.2,800 ఉండేది. ఆ తర్వాత రూ.5 వేలకు పెరిగగా ప్రస్తుతం రూ.8 వేలు అయింది. జరీ రూ.325 ఉండేది. ఇప్పుడు రూ.500 నుంచి 600, రంగులు 150-170 ఉండేవి. ఇప్పుడు రూ.300 నుంచి 500కి పెరిగాయి.

నేతన్న నేస్తం కోసం ఎదురు చూపులు

గత వైసిపి ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో ప్రతి ఏటా సాయం అందించడంతో ఆ కుటుంబాలన్నీ ఈ వృత్తిని కొనసాగించుకుంటూ జీవనం సాగించే పరిస్థితి ఏర్పడింది. 2023 జులైలో కోనసీమ జిల్లాలో 4,279 మందికి, కాకినాడ జిల్లాలో 2,778 మందికి, తూర్పుగోదావరి జిల్లాలో 916 మందికి నేతన్న నేస్తం చివరిసారిగా అందించారు. అయితే ఇంకా అనేక మందికి ఈ పథకం అందాల్సి ఉంది. ప్రభుత్వ విధానాల వలన చేనేత కార్మికుల బ్రతుకుల్లో మార్పులు రావడం లేదు. నేతన్న నేస్తం ద్వారా గుడ్డిలో మెల్లలా కాస్త ఉపయోగం ఉన్నప్పటికీ ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో కార్మికులకు ఉపాధి తగ్గుతూ వస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా నేతన్న నేస్తం ఇవ్వడం లేదు. రోజంతా కుటుంబం మొత్తం కష్టపడితే రూ.300 మించి కూలీ కూడా రావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేనేత రంగం కుదేలు అవుతున్న నేపథ్యంలో చాలా మంది ఇతర రంగాల వైపు మళ్లుతున్నారు.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి



గతంలో రోజుకి రూ.600 నుంచి రూ.800 వరకూ కూలీ వచ్చేది. ప్రస్తుతం రోజుకి 10 గంటలు కష్టపడుతున్నా రూ.300 మించి కూలీ రాని పరిస్థితి ఏర్పడింది. చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి. గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఎటువంటి నిబంధనలు లేకుండా నేతన్న నేస్తం అర్హులైన వారందరికీ అందివ్వాలి. అలాగే ఆప్కోకు పాలకవర్గాలను తక్షణమే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

-దున్న మురళీకష్ణ చేనేత కార్మికుడు, యు.కొత్తపల్లి

రాఘవులుకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ నుంచి పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న డివి.రాఘవులుకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రెండు బృందాలు శనివారం ప్రచారం జరిగింది. ఒక బృందానికి ప్రజాసంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా పలు ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రులను కలుసుకుని పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, అధ్యాపకులు, కార్మికులు, పట్టబద్రుల సమస్యలపై శాసనమండలిలో గొంతెత్తడానికి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును పట్టభద్రులు గెలిపించుకోవాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు, డిఎస్‌సి నోటిఫికేషన్ తెచ్చేందుకు, ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, స్కీం వర్కర్స్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలను నిలదీసేందుకు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా వివరించారు. ఉపాధ్యాయునిగా, జెఎసి నాయకునిగా 35 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై జరిగిన పోరాటం సాగించిన దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో చల్లా సంతోష్‌కుమార్, చైతన్య శ్రీనివాస్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మరో బృందానికి విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు నాయకత్వం వహించారు. పట్టభద్రులను కలుసుకుని పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులును గెలిపించాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి

'టిడ్కో గృహాలను తక్షణమే అందజేయాలి'

ప్రజాశక్తి - పిఠాపురం

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు తక్షణమే అందజేయాలని సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి డిమాండ్ చేశారు. సిపిఎం విస్తృత స్థాయి సమావేశం కె.నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోర్స రోడ్డులో టిడ్కో గృహ సముదాయాన్ని గత టిడిపి పాలనలో నిర్మించారని గుర్తు చేశారు. ఆ గృహాల్లో కొన్నింటిని వైసిపి ప్రభు త్వం లబ్ధిదారులకు అందజేసిందని, అయితే మిగి లిన లబ్ధిదారులకు నేటికీ ఇవ్వలేదని అన్నారు. దీంతో అనేక మంది లబ్ధిదారులు అద్దె ఇళ్లల్లో జీవించాల్సిన పరిస్థితి నెలకుం దన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా నేటికీ అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు గృహాలను అందివ్వడంలో విఫలం అయిందని విమర్శంచారు. మహాశివరాత్రికి పిఠాపురం పట్టణానికి పెద్ద ఎత్తున యాత్రికులు రానున్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యక ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కుంచే చిన్న, కోనేటి రాజు, మణి, వీరబాబు, సూర్యనారాయణ, జి అప్పారావు, శ్రీను, నాగు, స్టాలిన్, మణికంఠ, భవాని, సుజాత పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న విద్యార్థి

రక్తదాతలు ప్రాణదాతలతో సమానం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

రక్తదానం చేసిన వారు ప్రాణ దాతలతో సమానమని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ బుర్రా అనుబాబు అన్నారు. శనివారం మండలంలోని చేబ్రోలులో ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రోటరీ క్లబ్, యువసేన బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల ఛైర్మన్ బుర్రా అనుబాబు, కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ అనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. మనం ఆరోగ్యంగా ఉండాలని, ఇతరులకు రక్తదానం చేస్తామనే ధైర్యం కలిగి ఉండాలని సూచించారు. అన్ని దానాల కన్నా రక్త దానం గొప్పదని, 18 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు ఉన్న వ్యక్తులు అందరూ రక్తదానం చేయవచ్చని అన్నారు. విద్యార్థులకు రక్తదాన ఆవశ్యకతపై వివరించారు. ఈ శిబిరంలో 64 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిటెక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, డిప్లొమా ప్రిన్సిపల్ వైవిఎన్.రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం.సుబ్బారావు, యువసేన బ్లడ్ బ్యాంక్ అధినేత సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ బుక్ డేపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

రెడ్ బుక్ డే అంటే ఏమిటి అనేదానిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.రాంభూపాల్ అన్నారు. శనివారం స్థానిక ముప్పారపు అచ్చయ్యమ్మ కళ్యాణ మండపంలో రెడ్ బుక్ డే సందర్భంగా వివిధ ప్రజా సంఘాలతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మికులు వేతనాలపై ఆధారపడి జీవించడానికి, కొంతమంది అత్యంత సుఖవంతమైన జీవితం గడపడానికి కారణాలు ఏమిటి అనే దానిపై పరిశీలించి ప్రచురించిన పుస్తకమేనని అన్నారు రాజ్యం, విప్లవం అనే నినాదంతో 177 ఏళ్ల క్రితం ఈ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా ప్రచురించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆ పుస్తకాన్ని, మరిన్ని గ్రంథాలను ఈ విధంగా చర్చించుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర నాయకత్వం కమ్యూనిస్టు ప్రణాళికతో పాటు ఐవి.లెనిన్ రాసిన రాజ్యం, విప్లవం పుస్తకాన్ని అభ్యసించాలని అన్నారు. రాజ్యం అంటే ఏమిటి? రాజ్యం ఎవరికోసం పనిచేయాలి? ప్రస్తుతం రాజ్యం ఎవరి కోసం పని చేస్తుంది? అనే అంశాలపై వివరించారు. ప్రస్తుతం రాజ్యం ధనికులకు కొమ్ముకాస్తూ కార్మికుల వర్గాన్ని అణిచివేస్తూ ప్రస్తుత ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న పాలకులు ఆ సొమ్మును బడా బాబులకు అప్పనంగా అప్పగిస్తున్నారని విమర్శంచారు. ప్రజాస్వామ్యంలో ప్రజలంతా ఒక్కటే అని చెబుతున్న రాజ్యంలో అధికారం చేపట్టిన తర్వాత ధనిక, పేద అనే వర్గాలుగా విభజించి పాలిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలి కార్పొరేట్ వ్యవస్థలకు మేలు చేకూరేలా పాలన సాగిస్తున్నారని దయ్యబట్టారు. 177 సంవత్సరాల క్రితం ఫిబ్రవరి 21న ప్రపంచవ్యాప్తంగా ప్రచురించిన పుస్తకాన్ని ఫిబ్రవరి 21న రెడ్ బుక్ డేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ పుస్తకం చదివితే అనేక విషయాలు తెలుసుకునేందుకు వీలు ఉంటుందని సూచించారు. రైతు సంఘం నాయకులు గుర్రాల అప్పారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వివిధ ప్రజా సంఘాల నాయకులు జి.బేబిరాణి పలివెల వీరబాబు, ఇస్సాక్, చీకట్ల సాంబశివకుమార్, ఎం.లక్ష్మి, ఎం.ఆశాజ్యోతి, నక్కళ్ల శ్రీనివాస్, సత్యనారాయణ, చీకట్ల చిన్ని, జి.శ్రీను, కాళ్ల నాగేశ్వరరావు, కె.అప్పారావు, గంగాధర్ పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం నేత రాంభూపాల్

మహిళల జీవన శైలిపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

మహిళల జీవన శైలిపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం స్థానిక సాయి ఐశ్వర్య జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఆధిష్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్త్రీలలో సాధారణంగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, అవి తలెత్తే కారణాలు, నివారణ చర్యలు, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లు, ముందస్తు వైద్య పరీక్షల ప్రాముఖ్యతలపై వివరించారు. మహిళల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ దుర్గబాబు, ఇన్‌ఛార్జ్ సత్యనారాయణ, విద్యార్థినులు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య.

రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

రైతుల భూములకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేను మండలంలో త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డిఒ శ్రీరమణి సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రీ సర్వే పురోగతిపై సమీక్షించారు. జనన మరణాల నమోదు, ఎఫ్ఎంసి, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు వంటి సేవలు ప్రజలకు సకాలంలో అందించాలని సిబ్బందిని ఆదేశించారు. రీ సర్వేను త్వరితగతిన పూర్తిచేసి భూ వివాదాలను నివారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ నరేష్, ఆర్ఐ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీరమణి

రామారావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పిఠాపురం

అధ్యాపకులు డాక్టర్ కె.రామారావు సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. శనివారం స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ కె.రామారావు ఉద్యోగ విరమణ కార్యక్రమం ప్రిన్సిపల్ కేశవరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ కె.బాబ్జి పాల్గొని మాట్లాడారు. నిబద్ధత కలిగిన అధ్యాపకునిగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పారని కొనియాడారు. అనంతరం రామారావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిఎంహెచ్ఒ పవన్‌కుమార్, కాకినాడ బౌద్ధ విహార్ అధ్యక్షులు ఎ.రామేశ్వరరవు, చందర్రావు, జగదీష్, ఆరోరా, ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.


రామారావు దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

10వ తరగతి పరీక్షలకు 10,963 విద్యార్థులు


ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 188 పాఠశాలల నుంచి 10,963 మంది 10వ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఇన్‌ఛార్జ్ డివైఇఒ ఇ.ప్రభాకర శర్మ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయివేటు విద్యార్థులు 435 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. గండేపల్లి మండలం నుంచి 524 మంది, జగ్గంపేట నుంచి 1131 మంది, కిర్లంపూడి నుంచి 881 మంది, కోటనందూరు నుంచి 439 మంది, పెద్దాపురం నుంచి 1598 మంది, ప్రత్తిపాడు నుంచి 850 మంది, శంఖవరం నుంచి 703 మంది, రౌతులపూడి నుంచి 534 మంది, తొండంగి నుంచి 1030 మంది, తుని నుంచి 2342 మంది, ఏలేశ్వరం నుంచి 931 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.

ట్రస్ట్ ద్వారా పేదలకు సేవలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


నియోజకవర్గంలో ఎంఎంఆర్ ట్రస్ట్ ద్వారా పేదలకు సేవలు అందిస్తామని ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. శనివారం మండలంలోని పోతులూరు గ్రామంలో వల్లు ఏసుబాబు, ముప్పిడి అర్జునుడు కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆయా కుటుంబాలకు ట్రస్ట్ ద్వారా రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొండి రాంబాబు, శెట్టి సత్తిబాబు, చక్కపల్లి నాగేశ్వరరావు, చక్కపల్లి బుజ్జిబాబు పాల్గొన్నారు.



నగదు సాయాన్ని అందిస్తున్న మురళీకృష్ణంరాజు

భీమేశ్వరుడు పెళ్లి కొడుకాయనే...

ప్రజాశక్తి - సామర్లకోట

మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్లను పెళ్ళి కొడుకు, పెండ్లి కూతురుగా అలంకరించి శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈనెల 24వ తేదీన ప్రారంభం కానున్న మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఈ పూజలను నిర్వహించారు. స్వామి, అమ్మవారికి అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ కంటే జగదీశ్ మోహన్, ఆలయ పండితులు, అర్చకులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు



పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - యంత్రాంగం

గండేపల్లి మండలంలోని మురారి, గండేపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో పారిశుధ్యంపై చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ రవికుమార్ పాల్గొని మాట్లాడారు. సంపద కేంద్రాలను, తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మురారి సర్పంచ్ ఆనంద్, ఉపసర్పంచ్ వసంత్, కార్యదర్శి శిరీష, గండేపల్లి పంచాయతీ కార్యదర్శి ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** మండలవ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో శనివారం చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి హరికృష్ణ సత్యారెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణ చేశారు. **ఏలేశ్వరం** మండలంలోని 12 గ్రామాల్లోనూ పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎర్రవరం గ్రామంలో జరిగిన ప్రత్యేక డ్రైవ్‌లో ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామ కార్యదర్శులతో పాటు పంచాయతీ, సచివాలయల సిబ్బంది పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని పలు పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. తాళ్లరేవు, కోరంగి, చొల్లంగి, గాడిమొగ పంచాయతీల్లో పంచాయతీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించారు. తడి, పొడి చెత్త వేరుచేసి అంబాసిడర్‌కు ఇవ్వడం పట్ల అవగాహన కల్పించారు. **గొల్లప్రోలు** మండలంలోని చినజగ్గంపేట, తాటిపర్తి గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వి సాగర్‌కుమార్ పాల్గొని ప్రత్యేక డ్రైవ్‌కు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ రమణ, పాల్గొన్నారు.


గండేపల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న డిపిఒ రవికుమార్


బస్ షెల్టర్‌లో విశ్రాంతి తీసుకుంటున్న బిక్షాటకుడు

యాచకులకు నిలయంగా బస్ షెల్టర్

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర ఆలయానికి వచ్చే యాత్రికుల కోసం కాలువపై ఉన్న ఇనుప వంతెన వద్ద నిర్మించిన ఆర్‌టిసి బస్ షెల్టర్ బిక్షాటకులకు ఆశ్రమంగా మారింది. దీంతో బస్‌షెల్టర్ వద్ద పరిశుభ్రత లోపించింది. దీంతో బస్ షెల్టర్ వద్ద యాత్రికులు నిలవలేని పరిస్థితి నెలకుంది. యాత్రికుల కోసం గతంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో బస్ షెల్టర్‌ను నిర్మించారు. ఈ షెల్టర్‌ను ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ షెల్టర్ వద్ద ఆర్‌టిసి అధికారులు రిక్వెస్ట్ స్టాప్‌కు అనుమతి ఇచ్చారు. దీని పర్యవేక్షణ లేకపోవడంతో బిక్షాటకులకు నిలయంగా మారింది. దీంతో యాత్రికులు నిలువలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈనెల 24వ తేదీ నుంచి భీమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయానికి పెద్దఎత్తున యాత్రికులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బస్‌షల్టర్‌ను శుభ్రం చేసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వికలాంగ బాలల విద్యాబోధనపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సాగర్ మున్సిపల్ హైస్కూల్లో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల్లో శనివారం వికలాంగ బాలల విద్యా బోధనపై అవగాహన కల్పించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు వికలాంగ బాలల ఆర్‌పిడబ్ల్యూడి- 2026 చట్టంపై అవగాహన కల్పించారు. మే నెలలో జరిగిన సిడబ్ల్యూఎస్ఎన్ సర్వేలో సేకరించిన వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ విఆర్‌కె.చౌదరి, సిడిపిఒ జి.ఉష, హైస్కూల్ హెచ్‌ఎం శివప్రసాద్, డిఆర్‌పిలు జి.రాజు, ఆర్.అనిల్‌కుమార్, వి.శివశంకర్ పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న భవిత కేంద్రం సిబ్బంది

నేరాలు ఘోరాలు

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యేరుకు చెందిన కాపు ఉద్యమ నాయకుడు, ఆక్వా రైతు రాష్ట్ర సంఘసలహాదారు త్సవటపల్లి నాగభూషణంను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇవి.. చెయ్యేరులో కనుమ రోజున చుట్టుపక్కల గ్రామాలనుండి ఏకాదశ రుద్రులు ప్రభలు తరలివస్తాయి. ఆరోజున చెయ్యేరులో ఘనంగా తీర్థం నిర్వహిస్తారు. అనంతరం ప్రభను గ్రామంలోని వీధులగుండా తీసుకు వెళ్లి గ్రామోత్సవం చేస్తారు. ప్రభను తిరిగి తీసుకు వెళ్లేటప్పుడు. ప్రభ ముందు వెళుతున్న వాహనంలో నిర్వాహకులు ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేశారు. ఆర్కెస్ట్రాలోని మహిళా కళాకారులు నత్యాలు చేయడంతో పోలీసులు ఆర్కెస్ట్రాను ఆపివేశారు. దీనితో స్థానికులు ప్రభను రోడ్డుకు మద్యలో నిలిపి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇలా కొనసాగుతుండగా సుమారు అర్ధరాత్రి సమయంలో అక్కడికి వచ్చిన నాగభూషణం పోలీసులతో వాగ్వాదానికి దిగారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఆయనను అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.

సారా తయారీదారుడు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మండల పరిధిలోని తుపాకుల గూడెం అసైన్డ్ భూమిలో కొవ్వూరు ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. రాయుడు దానయ్య అనే పాత నేరస్థుడు అసైన్డ్ భూముల్లో రహస్యంగా సారా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 35 లీటర్ల సారాను, 16 డ్రమ్ముల్లో ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఐదు కేజీల అమ్మోనియాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దానయ్యపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఇ.రవికుమార్, సిబ్బంది నారాయణ, నాగేశ్వరావు, సత్యనారాయణ, విఆర్ఓ సాయి పాల్గొన్నారు.


ప్రమాదానికి గురైన లారీ

కాలువలోకి దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి - కాజులూరు

యానం-ద్రాక్షారమ రహదారిలో గొప్పిరేవు వద్ద శుక్రవారం అర్ధరాత్రి లారీ అదుపుతప్పి వంతెన రైలింగ్‌ను ఢీకొని టేకి కాలువలోకి దూసుకుపోయింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...యానాం నుంచి ద్రాక్షారామ వైపు వస్తున్న లారీ అదుపు తప్పి వంతెన ఢీకొట్టి కాలువలో పడిపోయింది. కాలువలో నీరు తక్కువగా ఉండటంతో లారీ ఊబిలో కూరుకుపోయింది. లారీ డ్రైవర్, క్లీనర్ పెద్దపెద్ద కేకలు వేయడంతో స్థానికులు గమనించి వారిని బయటకు తీశారు. వారిద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి గురియైన లారీ కర్ణాటక రాష్ట్రానికి చెందినదిగా గుర్తించినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వేట్లపాలెం శివారు కెనాల్ రోడ్డుపై బైక్ అదుపుతప్పి పడడంతో సామర్లకోట భాస్కర కాలనీకి చెందిన నగరం సత్తిబాబు (42) శనివారం మృతి చెందాడు. స్థానికుల వివరాలు ప్రకారం... కాకినాడలో ఒక ప్రయివేటు కళాశాలలో పీడీగా పని చేస్తున్న సత్తిబాబు విధులు ముగించుకుని సామర్లకోట ఇంటికి చేరుకున్నాడు. అనంతరం మండలంలోని పెద్ద బ్రహ్మదేవం గ్రామం అత్తారింటికి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా సామర్లకోట - ద్వారపూడి కెనాల్ రోడ్డులో బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజశక్తి-కడియం

పలు నేరాలకు పాల్పడిన ఐదుగురు నిందితులను కడియం పోలీసులు అరెస్టు చేశారని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి ఎస్.భవ్యకిషోర్ తెలిపారు. కడియం పోలీస్ స్టేషన్‌లో సిఐ ఎ.వెంకటేశ్వరరావుతో కలిసి శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.కడియం మండలం జేగురుపాడుకు చెందిన గంగరాజు సత్యవతి జనవరి 18న ఆలయానికి వెళ్లి వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న బంగారపు నగలను లాక్కుని పారిపోయారు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన కడియం పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో నిందితులు కొత్తపల్లి త్రిమూర్తులు, కూరాకుల సుబ్బారావు, గాదంశెట్టి వెంకన్న, పచ్చ రాజు, గుమ్మడి సత్యనారాయణమూర్తిలను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరు కడియం, మండపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో జరిగిన చోరీలతో సంబంధం ఉందన్నారు. వారి నుంచి 58 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు వెండి, ద్విచక్ర వాహనం, కాపర్ వైరు, రూ. 50 వేలు నగదు మొత్తం రూ.5.4 లక్షలు విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న డిఎస్‌పి భవ్యకిషోర్

హోరా హోరీ...

గోదారి గలగలలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టబద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఉభయ గోదావరి జిల్లాలో పట్టభద్రుల స్థానానికి ఉమ్మడి ఉభయగోదావరి జల్లాల నుంచి 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్న విషయం విధితమే. ప్రధానంగా కూటమి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్యే ఈ పోరు జరుగనుందని సుస్పష్టం. కొన్ని గంటల్లో ప్రచార పర్వానికి తెరపడనుంది. మరో 4 రోజుల్లో పోలింగ్ సైతం జరగనుంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాలతో మొదలై నియోజక వర్గ కేంద్రాల వరకూ ప్రచారాస్త్రాలకు పదును పెట్టారు. ఓ వైపు ప్రకటనలు, మరోవైపు సోషల్ మీడియాలోనూ ప్రచారాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు తరుపున ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు ముమ్మరంగా ప్రచారంలో పాల్గొంటున్నాయి. స్వచ్ఛదంగా వచ్చి రాఘవులును గెలిపించాలని, ఆయన గెలుపు ఆవశ్యకతను వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. కూటమి అభ్యర్థి మ్రాత్రం కుల, మత సమీకరణల ప్రాతిపదికన ప్రచారాన్ని చేసుకుంటున్నారు. ఈమేరకు నియోజక వర్గ కేంద్రాల్లో సమావేశాలకు సైతం నేటి నుంచి తెరలేపారు. ఈ సమావేశాల మాటున తాయిలాల ఎరవేసేందుకే అనే అనుమానాలు ఇతర అభ్యర్థుల నుంచి వినిపిస్తున్నాయి. కూటమి అభ్యర్థి పట్ల అధికార యంత్రాంగా కూడా సానుకూలంగా వ్యవరించడం పలు విమర్శలకు తావిస్తోంది. మరి చివరి సమయంలో తాయిలాలన ఉన్నతాధికారులు ఎలా అడ్డుకుంటారో వేచి చూడాలి..

మరో వైపు ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రకటన, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం వంటి ప్రక్రియలను అధికారులు పూర్తి చేశారు. మరో వైపు కొత్త ఓట్ల నమోదుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి యువతను ఓటర్లుగా చేర్చుతున్నారు. రిటర్నింగ్ అధికారుల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. అధికార ప్రతిపక్ష పార్టీలతో ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించడంతో పాటు రాబోయే ఎన్నికల విధులతో ప్రత్యక్ష సంబంధం ఉన్న పలువురు అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఎన్నికల కేంద్రాలపైనా ఓ స్పష్టత వచ్చింది. ఓటింగ్ సామగ్రి సైతం రాష్ట్ర ఎన్నికల సంఘం పంపింది. రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షములో వీటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్ర పరిచారు.

పరీక్షా సమయం...

విద్యార్థులలో పరీక్షల ఫియర్ మొదలైంది. మార్చిలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే విద్యాశాఖ ప్రకటించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ఆయా విద్యాసంస్థలు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాయి. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయం విధితమే. పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో గత రెండేళ్లుగా జిల్లా పూర్తిగా వెనుకబడిన విషయం విధితమే. గత పరిస్థితుల నుంచి పాఠాలను తీసుకుని ఈ సారైనా మెరుగైన ఫలితాల దిశగా అడుగులు వేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముందుగానే మంటలు

వేసవి పూర్తిగా రాకుండానే జిల్లాలో ముందుగానే మంటలు మొదలయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 6 నుంచి 8 డిగ్రీల వరకూ పెరిగాయి. భానుని ధాటికి ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత అధికమవుతోంది. మరో వైపు అప్రకటిత విద్యుత్ కోతలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ వినియోగం జిల్లాలో 21 మిలియన్ యూనిట్లకు చేరటంతో అప్రకటిత విద్యుత్ కోతలు అనివార్యంగా మారాయి. జిల్లాలో సర్వీసు సంబంధిత సమస్యల పేరుతో అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కార్మికవర్గ రాజ్య స్థాపనతోనే మానవాళికి విముక్తి

ప్రజాశక్తి - కాకినాడ

కార్మిక వర్గ రాజ్య స్థాపనతోనే దోపిడీ నుంచి మానవాళికి విముక్తి జరుగుతుందని ఎపి రైతు సంఘం నాయకులు వి.రాంభూపాల్ అన్నారు. శనివారం స్థానిక కచేరి పేటలోని యుటిఎఫ్ హోంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే సందర్భంగా వి.ఐ.లెనిన్ రచించిన రాజ్యం - విప్లవం అనే గ్రంథంపై సదస్సు జరిగింది. సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాంభూపాల్ మాట్లాడారు. మార్క్స్ ఎంగిల్స్ రచించిన కమ్యూనిస్టు మేనిఫెస్టో-1848 ఫిబ్రవరి 21న విడుదలైందన్నారు. ఆ తేదీని స్ఫూర్తిగా తీసుకుని వామపక్ష ప్రచురణ సంస్థలు 2019 నుంచి రెడ్ బుక్ డే ప్రారంభించడం జరిగిందన్నారు. లెనిన్ సుప్రసిద్ధ రచన రాజ్యం - విప్లవం 1917 సెప్టెంబర్‌లో విడుదలైందన్నారు. ఈ గ్రంథంలో సమాజ పరిణామంలో రాజ్యం పాత్రను అద్భుతంగా విశ్లేషించిందన్నారు. మార్క్స్ సిద్ధాంతం ప్రకారం కార్మిక రాజ్య స్థాపన ద్వారా రాజ్యం అంతరిస్తుందన్నారు. అయితే లెనిన్ సూత్రీకరణ ప్రకారం ముందుగా కార్మికవర్గం అధికారం చేపట్టి రాజ్యాంగ యంత్రాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. తద్వారా దోపిడీ నుంచి మానవాళి విముక్తి జరగాలన్నారు. అయితే పెట్టుబడిదారీ వర్గం అంత సులువుగా అధికారాన్ని వదులుకోదన్నారు. సంఘటితం అవుతున్న కార్మిక, కర్షక, కష్ట జీవులను కులం, మతం, జాతి, ప్రాంతం వంటి భావాలతో విభజిస్తారని తెలిపారు. భావజాల రంగంలో కూడా కార్మికవర్గం పైచేయి సాధించాలన్నారు. ఈ సదస్సు కి పలివెల వీరబాబు స్వాగతం పలుకగా జి. ప్రభాకర వర్మ వందన సమర్పణ చేశారు.



రెడ్ బుక్ డే సదస్సులో మాట్లాడుతున్న రాంభూపాల్

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - కరప, ప్రత్తిపాడు

కరప మండలంలో శనివారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం అయింది. ఈ సందర్భంగా ఇంటింటి నుంచి కార్మికులు చెత్త సేకరణ చేశారు. గొర్రెపూడిలో జరిగిన కార్యక్రమంలో డిఎల్‌పిఒ అన్నామణి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. తెలిపారు. ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని డిపిఒ వి.రవి కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్మీ కంపోస్ట్ యార్డ్ లేకపోవడం ఏంటని సిబ్బందిని ప్రశ్నించారు. యార్డుకు స్థలం కేటాయించాలని తహశీల్దార్‌కు లేఖ రాయాలని పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజుకు సూచించారు. ఇంటింటా చెత్త సేకరణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, సచివాలయం సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రత్తిపాడులో పర్యటించిన డిపిఒ రవికుమార్

ఘనంగా లయన్స్ క్లబ్ 50వ వసంతాల వేడుక

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక లయన్స్ క్లబ్ 50వ వసంతాల వేడుక స్థానిక సాయి బాలాజీ ఫంక్షన్ హాలులో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత జెండాను ఆవిష్కరించి జ్యోతి ప్రజల్వన చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎంఎస్‌బి.గంగాధరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరక్టర్ సుభాష్‌బాబు పాల్గొని మాట్లాడారు. 1975 ఫిబ్రవరి 22 న జగ్గంపేటకి చెందిన డాక్టర్ గోలి శ్రీరాములు లయన్స్ క్లబ్‌ను ప్రారంభించారని గుర్తు చేశారు నాటి నుంచి నేటి వరకు క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిం చామన్నారు. ఈ కార్యక్రమంలో ఇవివి.ఈశ్వర్‌కుమార్, వజ్రపు కోటేశ్వరరావు, చిట్టినీడి శ్రీనివాసరావు, లైన్స్ క్లబ్ కాన్ఫరెన్స్ కమిటీ ఛైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

జవాబుదారీగా రెవెన్యూ సేవలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంలో జవాబుదారీగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ టి.సీతారామ మూర్తి, కలెక్టరేట్ ఎఒ ఎమ్‌డి.ఆలీలతో కలిసి మండలాల వారీగా రెవెన్యూ అధికారుల పని తీరును సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి ఎక్కువగా రెవెన్యూ పరమైన అర్జీలే వస్తున్నాయన్నారు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యుటేషన్లపై రెవెన్యూ ఫిర్యాదులు, రెవెన్యూ రికార్డుల్లో నమోదులు, ఆదాయ సవరణ, ఎస్-ఎల్‌ఎ సర్టిఫికెట్లు, ఆర్ఒఆర్ డేటాలో దిద్దుబాట్ల కోసం అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో ఉద్యోగ సంబంధ రెవెన్యూ అభ్యర్థన, రెవెన్యూ ఉద్యోగుల సేవా సమస్యలు ఇంక్రిమెంట్ల మంజూరు, ప్రమోషన్ కోసం అభ్యర్థన, మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు కోసం పెండింగ్ ఫైల్స్ పురోగతిపై అంశాలపై సమీక్షించారు. అలాగే ప్రజలకు జారీ చేయాల్సిన సర్టిఫికెట్లలో జాప్యం, ప్రభుత్వం సేకరించిన భూమికి పరిహారం చెల్లించకపోవడం, భూసేకరణపై తీసుకొన్న చర్యలపై సమీక్షించారు. రెవిన్యూ డివిజన్ అధికారి ప్రతి రోజు కనీసం ఒకసారైనా తహశీల్దార్ వారీగా అర్జీల పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలపై సమీక్ష నిర్వహించాలన్నారు. సిఎంఒ, మంత్రులు, రాష్ట్ర స్థాయిలో వస్తున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం నాటికి భూసేకరణకు సంబంధించి పెండింగ్ అంశాలపై ఫారం-సి ద్వారా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అబ్జెక్షన్‌లేని ప్రభుత్వం భూముల్లో పేదలు నివాసం ఉంటే కరెంటు బిల్లు, వాటర్ టాక్స్ ఆధారంగా వెరిఫికేషన్ చేయాలన్నారు. ఎయిర్‌పోర్ట్, డిఫెన్స్ ల్యాండ్స్, జాతీయ రహదారులు వంటి ప్రాధాన్యతతో కూడిన భూ సేకరణ పనులు వేగవంతం చేసి సోమవారం నాటికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. దీపం పథకం ద్వారా లబ్ధిదారులకు ఇచ్చే సబ్సిడీ వారి బ్యాంకు ఖాతాలో జమయ్యేలా చూడాలన్నారు. ఇప్పటికే వివిధ శాఖల పనితీరుపై క్యూ ఆర్ కోడ్ ద్వారా సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే సమీక్ష నాటికి పెండింగ్‌లో ఉన్న అన్ని రెవెన్యూ అంశాలు పూర్తి చేయాలన్నారు.

జెసి చిన్నరాముడు మాట్లాడుతూ సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం ప్రజల్లో కల్పించడంలో క్షేత్ర స్థాయిలో తహశీల్దార్లు వ్యవహరించే తీరు ముఖ్యమన్నారు. ఆర్‌డిఒ అధ్వర్యంలో మండల వారీగా ఫిర్యాదులు పరిష్కార విధానంపై ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి టి.సీతారామమూర్తి, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఎఒ ఆలీ, తహశీల్దార్లు, కలక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

వల్లభస్వామికి రూ.4.56 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతిలో ఉన్న శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.4.56 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వ హణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టికెట్ల ద్వారా రూ.3,32,050, అన్నదాన విరాళాల ద్వారా రూ.79,832, కేశఖండన ద్వారా రూ.7,040, తులాభారం ద్వారా రూ.950, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.37,125లు మొత్తం రూ.4,56,997 ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు యాత్రికులకు సేవలందించారు.


అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

గ్రామాల్లో పర్యటించిన ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శనివారం పర్యటించారు. ఆయా ప్రాంతాలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ప్రజా పనులశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఫెర్రీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న రోడ్లు, ఐ లవ్ యానాం లోగో నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హిందూ, క్రిస్టియన్ స్మశాన వాటికల్లో జరుగుతున్న మరమ్మతుల పనులను పరిశీలించారు. ఈ పర్యటనలో ప్రజపనులు శాఖ ఇన్‌ఛార్జ్ ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ళ నాగరాజు, చెల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అశోక్

మృత్యు కూడళ్లుగా హైవే జంక్షన్లు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

స్థానిక హైవే జంక్షన్‌లు మృత్యు రహదారులుగా ఉంటున్నా యని పిసిసి మెంబర్ ధరణాలకోట శ్రీను అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్‌కు ఆయన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంతోషి మాత గుడి జంక్షన్ వద్ద రాత్రి సమయంలో లైటింగ్ తక్కువగా ఉండడంతో వాహనదారులు హైవే దాటి సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని హైవే అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందన్నారు దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీను

ఆదిత్యలో యూత్ లీడర్‌షిప్ వర్క్ షాప్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో యూత్ లీడర్‌షిప్‌పై వర్క్ షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు సలాది శ్రీరామచంద్రమూర్తి, సిఐ ఆర్. అంకబాబు పాల్గొని మాట్లాడారు. నాయకత్వం, ప్రేరణ, దేశ నిర్మాణంపై వారు వివరించారు. విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన వృద్ధికి సాధికారత గల అంశాలపై చర్చింరాఉ. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్టర్ డాక్టర్ జి.సురేష్, డీన్ క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్, రోట్రాక్ట్ క్లబ్ సభ్యులు వివి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

రోడ్డున పడ్డ పశువైద్య సిబ్బంది

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మూడేళ్లుగా 1962 హెల్ప్ లైన్ పశువైద్య మొబైల్ క్లినిక్ వాహనాలను నిలిపేసి, కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడంతో వారంతా రోడ్డున పడ్డారు. తమను విధుల్లోకి తీసుకోవాలని, న్యాయం చేయాలని కోరుతున్నారు. ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఫెడరేషన్ అనుబంధం 1962 హెల్ప్ లైన్ వెటర్నరీ మొబైల్ క్లినిక్‌ల యూనియన్ సమావేశం స్థానిక హ్యాపీ పార్క్ వద్ద శనివారం జరిగింది. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.హేమసుందర్, ఎం.చరణ్‌సత్యసాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎ.హేమసుందర్, ఉపాధ్యక్షులుగా జి.రాజారత్నం, సెక్రటరీగా ఎం.చరణ్‌సత్యసాయి, జాయింట్ సెక్రటరీగా జి.సుప్రవాన్, కోశాధికారిగా కె.సురేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వీరు స్థానిక ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసును కలివారు. తొలగించిన తమను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. దీనికి ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించారు. న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాజేష్, శశి, జ్యోతి, శ్రీను, శివ తదితరులు హాజరయ్యారు.

గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

టమాటా పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మార్కెటింగ్ శాఖ ఎడిఎం కె.రాఘవేంద్రరావు తెలిపారు. టమాటకు ధర రాకపోతే రైతులు దగ్గరలో ఉన్న రైతు బజారుకి తీసుకు వచ్చి ఎస్టేట్ అధికారులని సంప్రదించాలని సూచించారు.

సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని ఐబిసి కాలనీలో ఏర్పాటు చేస్తున్న ఎయిర్ టెల్ సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆ ప్రాంత ప్రజలు నగర పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సెల్ టవర్ నిర్మాణం వల్ల మా ప్రాంత ప్రజలకు అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని కావున ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ ఎ.గోవిందు, రాజనాల లక్ష్మీమూర్తి, ఎల్లా శ్రీను, బస కామాబాబు, మొరాశెట్టి కామేష్ పాల్గొన్నారు.

ముమ్మురంగా రైతు గుర్తింపు సంఖ్య నమోదు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో రైతు గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ ముమ్మురంగా కొనసాగుతుందని మండల వ్యవసాయ అధికారి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ నమోదు ప్రక్రియ ముమ్మురంగా కొనసాగుతుందన్నారు. రైతులందరూ తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.